క్లుప్తంగా

నేడు వాహనాల వేలం

వెదురుకుప్పం: సారా, ఎక్సైజ్ కేసులలో సీజ్ చేసిన వాహనాలను స్థానిక స్టేషన్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ గోపి సోమవారం తెలిపారు. ఆసక్తిగల వారు వేలంలో పాల్గొనవచ్చన్నారు.

పాఠశాల తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ రాజేంద్రప్రసాద్

పాలసముద్రం: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను బోధించాలని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం ఆముదాల ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. తొలుత విద్యార్థుల హాజరు పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం రుచి చూసి మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను గురించి మెరుగు పరచుకునేలా ఉపాధ్యాయులు అవగాహన పెంచాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో టీచర్ బాబు పాల్గొన్నారు.

'పరివర్తనే' ప్రభుత్వ ధ్యేయం

పుత్తూరు రూరల్: తప్పుడు మార్గం నుంచి సన్మార్గం వైపు నడిచేందుకే ప్రభుత్వం పరివర్తన 2.0 కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని పుత్తూరు ఎస్‌ఈబీ స్టేషన్ ఎస్‌ఐ ఎ.నాగరాజు పేర్కొన్నారు. పరివర్తన 2.0 కార్యక్రమంలో భాగంగా సోమవారం స్టేషన్ పరిధిలోని తిరువట్యం, భీమునిచెరువు, ఎరికంబట్టు, కీశగరం గ్రామాల్లో నాటు సారా తయారీపై తనిఖీలు నిర్వహించారు. అనంతరం చెడు అలవాట్లు, వాటి వల్ల కలిగే అనర్థాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మంచి మార్గంలో నడుస్తూ సమాజంలో గౌరవంగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌సీ కె.రవి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ కుమార్

పుత్తూరు రూరల్: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎస్సీ ఎస్టీ అధ్యాపకుల సంఘం క్యాలెండర్‌ను ప్రిన్సిపల్ ఎస్.వి.కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనందరావు, అధ్యాపకులు హరీష్, భాగ్యరాజు, గుణవర్ధన్, ప్రవీణ్‌నాయక్, ప్రసన్న, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో మహిళలదే కీలక పాత్ర

కార్వేటినగరం: దేశాభివృద్ధిలో మహిళలదే కీలక పాత్ర అని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి అన్నారు. జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ సీఎన్ లత అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడారు. భారతదేశపు నైటింగేల్‌గా ప్రసిద్ధి చెందిన సరోజిని నాయుడు జయంతి పురస్కరించుకుని జాతీయ మహిళా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పితృస్వామ్య భారత సమాజంలో మహిళల హక్కుల కోసం సరోజినీ నాయుడు ఎనలేని కృషి చేశారని ఆమె సేవలను స్మరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు విష్ణుప్రియ, లావణ్య, పావులూరి అశ్విని, విద్యార్థులు పాల్గొన్నారు.

చెస్ విజేతలకు బహుమతుల ప్రదానం



చెస్ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని మురుగానిపల్లిలో ఉన్న న్యూయార్క్ పాఠశాలలో రాష్ట్ర స్థాయి ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. చిత్తూరు చెస్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎస్‌ఆర్‌బీ.ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో విజేతలకు ఆదివారం ఆ పాఠశాల ఎండీ శ్రీధర్, తదితరులు బహుమతులు అందజేశారు. పురుషోత్తమన్ తిరుమలై మొదటి బహుమతి 10,000నగదుతోపాటు ట్రోఫీని అందుకున్నారు.మల్లేశ్వర రెండవ స్థానం రూ.6,000, రాజు మూడవ స్థానాన్ని రూ.4000 కైవసం చేసుకున్నారు. ఓపెన్ కేటగిరీలో మొత్తం 30 మందికి నగదు బహుమతిని అందజేశారు.

ఏడు టిప్పర్లు సీజ్

సత్యవేడు: మండలంలో సరైన రికార్డులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్న ఏడు టిప్పర్లను ఏడీ మైనింగ్ అధికారి ప్రకాష్‌కుమార్ సీజ్ చేశారు. సోమవారం చెన్నేరి సమీపంలో మైన్స్ అధికారులు తనిఖీలు చేస్తూ, సమీప క్వారీల నుంచి తమిళనాడుకు తరలిస్తున్న టిప్పర్లను వారు పరిశీలించారు. సరైన రికార్డులు లేక, అధిక బరువుతో ఉన్న ఏడు టిప్పర్లను సీజ్ చేసి సత్యవేడు పోలీసులకు అప్పగించారు.

సదాశివకోనలో వెలసిన సదాశివుడు




అమ్మవారి కోనలో వెలసిన కామాక్షి అమ్మవారు



భక్తులకోసం ప్రత్యేక క్యూ ఏర్పాటు



అమ్మవారి కోనలోని జలపాతం



సంతాన ప్రదాత.. సదాశివుడు

- సుందరమైన అడవిలో వెలసిన ఆదిదేవుడు
- సదాశివకోనలో మహా శివరాత్రికి ఏర్పాట్లు
- భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు

వడమాలపేట: సుందరమైన అడవులు, కొండ కోనల్లో వెలసిన సదాశివుడు సంతాన ప్రదాతగా భక్తులనుంచి విశేష పూజలందుకుంటున్నాడు. మండల పరిధిలో ఉన్న సదాశివకోన ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా నిత్యం భక్తుల తాకిడితో అలరారుతోంది. మన రాష్ట్రం నుంచే కాకుండా తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఇక్కడ ఉన్న జలపాతాల్లో స్నానమాచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేస్తున్నారు. సదాశివ అడవుల్లో వెలసిన శ్రీ కామాక్షి సదాశివేశ్వర స్వామి ఆలయం మహాశివరాత్రికి ముస్తాబవుతోంది.

ఆలయ ప్రత్యేకత

దంపతులు ఇద్దరూ జలపాతంలో స్నానమాచరించి తడి దుస్తులతో ప్రదక్షిణలు చేసి సదాశివుడిని దర్శిస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. ఈ క్రమంలోనే అధిక సంఖ్యలో దంపతులు స్వామి, అమ్మవారిని దర్శించుకుని కోర్కెలు కోరుకోవడం, తదనంతరం మొక్కులు చెల్లించుకోవడం చేస్తుంటారు. సదాశివకోనకు సమీపంలో కామాక్షి అమ్మవారి కోన ఉంది. ఈ కోనలో పూర్వం మహామునులు పౌర్ణమి అమృత ఘడియల్లో జలపాతంలో స్నానమాచరించి, అక్కడే సహజ సిద్ధంగా ఏర్పడిన గుహ ద్వారా శ్రీకాళహస్తిలోని వాయులింగేశ్వర స్వామిని దర్శించే వారని ప్రతీతి. సదాశివేశ్వరుడిని దర్శించుకోవడానికి ప్రత్యేక పర్వదినాలు శివరాత్రి, చిత్రా పౌర్ణమి, నవరాత్రులు, పౌర్ణమి అని ఇక్కడి అర్చకులు చెబుతున్నారు.

మహాశివరాత్రికి ఏర్పాట్లు

దేవాదాయ శాఖ పరిధిలోని సదాశివకోన ఇటీవల రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజనుల, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా పుత్తూరు పట్టణానికి చెందిన జయచంద్రన్‌ను ట్రస్టు బోర్డు చైర్మన్‌గా, మరి కొందరిని సభ్యులుగానూ నియమించారు. ఈ ట్రస్టు బోర్డు ఆధ్వర్యంలో శివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో వ్యయప్రయాసల కోర్చుతూ స్వామి దర్శనానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వసతి, భోజన ఏర్పాట్లు, క్యూలు, ఏర్పాట్లు చేస్తున్నారు. 18వతేదీ శివరాత్రి సందర్భంగా వేకువ జామున లింగోద్భవ అభిషేకం నిర్వహించి, అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించనున్నారు. సులభ దర్శనం కోసం ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేస్తున్నారు. వడమాలపేట, పుత్తూరు, ఏర్పేడు మండలాలకు చెందిన పలు సంఘాలు భక్తులకు భారీ ఎత్తున అన్నదానం చేసేందుకు సన్నద్ధమవుతున్నాయి.



సదాశివకోనలోని జలపాతం

సదాశివకోనకు వెళ్లే మార్గాలు

కాలి నడకన వెళ్లేందుకు వడమాలపేట సమీపంలో రామసముద్రం గ్రామానికి వెళ్లే రోడ్డు బైపాస్ నుంచి 8 కిలోమీటర్లు నడవాల్సి ఉంటుంది. పుత్తూరు నుంచి బస్సు సదుపాయం ఉంది. ఈ బస్సు నాగిలేరు వరకు వెళుతుంది. అక్కడి నుంచి కోనకు ఆరు కిలోమీటర్లు నడిచి వెళ్లవలసి ఉంటుంది. శివరాత్రి సందర్భంగా ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులు నడుపుతారు. కోనకు నేరుగా వాహనాలలో వెళ్లాలంటే ఏర్పేడు మండలం పాయల్ సెంటర్ మీదుగా నేరుగా జీపులు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలద్వారా సదాశివకోనకు చేరుకోవచ్చు. సుమారు 12 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంటుంది.

సోషల్ మీడియా కన్వీనర్‌గా మదన్

గంగాధరనెల్లూరు: వైఎస్సార్‌సీపీ జీడీనెల్లూరు నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్‌గా గంగాధర నెల్లూరుకు చెందిన మదన్ నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. మదన్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కన్వీనర్‌గా నియమించినందుకు డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ.విజయానందరెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గుణశేఖర్‌రెడ్డికి, మండల నాయకులకు కతజ్ఞతలు తెలిపారు.

కొండమల్లీశ్వరునికి ప్రత్యేక పూజలు



దీపారాధన చేస్తున్న అర్చకుడు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎన్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామి వారికి విశేష పూజలు చేశారు. వేకువ జామునే సుప్రభాత సేవతో స్వామి వారిని ఆలయ ప్రధాన అర్చకులు మేల్కొలిపి ధూప దీప నైవేద్యాలు సమర్పించి, పాలాభిషేకం చేశారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచారు. అలాగే ఆలయ ఆవరణలోలని పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఇళ్ల నిర్మాణాల్లో జాప్యం వద్దు



నాశంపల్లె హౌసింగ్ కాలనీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీదేవి

గంగాధరనెల్లూరు: జగనన్న హౌసింగ్ కాలనీల్లో జాప్యం లేకుండా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఎంపీడీఓ శ్రీదేవి ఆదేశించారు. సోమవారం మండలంలోని నల్లరాళ్లపల్లె, నాశంపల్లె హౌసింగ్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీడీఓ పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. పనులు వేగవంతం చేసి, ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసి, ప్రారంభించే దిశగా పర్యవేక్షించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. లబ్ధిదారులకు బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: మండలంలో జగనన్న లేఔట్ల గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎస్.విద్యావతి కోరారు. తొట్టికండ్రిగ పంచాయతీ జగనన్న లేఔట్‌లో పనులను సోమవారం ఆమె పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈ మధు, ఇంజినీర్ అసిస్టెంట్ జయరాజ్, నాగరాజు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



పాలసముద్రం: ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ విద్యావతి

క్షయపై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మోహన్‌క్రిష్ణ

పాలసముద్రం: క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ అన్నారు. సోమవారం పాలసముద్రం బీసీ బాలికల హాస్టల్‌లో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ, క్షయ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే వైద్యుల పర్యవేక్షణలో క్రమం తప్పకుండా మందులు వాడి, వ్యాధి నుంచి పూర్తిగా విముక్తి పొందవచ్చన్నారు. క్షయ లక్షణాలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, డాట్ పద్ధతిలో వైద్యం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుశీల, మురళి, వార్డెన్ కోటేశ్వరన్, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి

పుత్తూరు రూరల్: విద్యార్థినులు ఉన్నత విద్యలో సైన్స్ సబ్జెక్టును ఎంపిక చేసుకొని శాస్త్రవేత్తలుగా ఎదగాలని స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి సూచించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో స్త్రీల పాత్ర అనే అంశంపై గత వారం రోజుల పాటు వకృత్వ, వ్యాస, రంగోలి, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ క్రమంలోనే సోమవారం కళాశాలలో శాస్త్ర సాంకేతిక అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాన్ని ఉపాధిగా ఎంచుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, నిరంతర అధ్యయనం, అవకాశాలను అందిపుచ్చుకోవడం వంటి లక్షణాలను ప్రతి విద్యార్థి అలవర్చుకోవాలని చెప్పారు. అప్పుడే ఎలాంటి లక్ష్యాలనైనా సాధించవచ్చని సూచించారు. అనంతరం పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వి.వీరయ్య, అధ్యాపకులు ఎం.అరుణకుమారి, జి.స్వాతి, ఎస్.పద్మావతి, ఎ.సుజల, గాయత్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణించాలి



వాలీబాల్ క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందజేస్తున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: రాష్ట్ర స్థాయి క్రీడల్లోనూ ప్రతిభ చాటి జిల్లాకు మంచి పేరు తేవాలని ఎంపీపీ లత ఆకాంక్షించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశిక్షణా సంస్థలో వారం పాటు వాలీబాల్ గేమ్ శిక్షణ శిబిరం నిర్వహించారు. అండర్–14 బాలబాలికలకు ఈ శిక్షన ఇచ్చారు. శిక్షణ పొందిన ఉమ్మడి జిల్లాలోని 38 మంది బాలబాలికలకు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ క్రీడా దుస్తులను ఎంపీపీ చేతుల మీదుగా అందజేశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బాలబాలికలకు డైట్‌లో శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. పార్టీ కన్వీనర్ ధనంజయవర్మ మాట్లాడుతూ, క్రీడాకారులను ప్రోత్సాహిస్తూ వారం పాటు భోజనం, వసతి, కలిృంచడమే కాకుండా క్రీడా దుస్తులను వితరణ బాలాజీతోపాటు అందరి నమ్మకాన్ని వమ్ము చేయకుండా క్రీడల్లో జిల్లాకు పేరు తేవాలన్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ సురేష్‌బాబు మాట్లాడుతూ, ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు పల్నాడు జిల్లా, నర్సారావుపేటలో అండర్–14 రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో జిల్లా జట్టు పాల్గొంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ చెంగల్‌రాజు, సూపరింటెండెంట్ కృపావతి, పీఈటీలు గంగాధరం, జయప్రద, గీత, లక్ష్మీపతి, విజయ్, వేణుగోపాల్, ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ చేయిస్తే జైలు, జరిమానా






హాజరైన అధికారులు, సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శివయ్య

పెనుమూరు (కార్వేటినగరం): వెట్టిచాకిరీ ఎవరూ చేయించరాదని ఎంపీడీఓ శివయ్య అన్నారు. వెట్టిచాకిరీ నిర్మూలనపై సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ, వెట్టిచాకిరీ చేయిస్తే జైలుశిక్ష, అలాగే భారీ జరిమానా తప్పదని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితులలో విధిలేక తీసుకున్న అప్పును తీర్చడానికి నిర్బంధంగా వెట్టిచాకిరీ చేయిస్తున్న పక్షంలో రెవెన్యూ, పోలీసు, కార్మిక శాఖలు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీస్, మండల స్థాయి అధికారులు, సచివాలయ, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానవాటిక స్థల పరిశీలన

కార్వేటినగరం: మండలంలోని బండ్రేవు కాలనీకి సంబంధించి నూతనంగా ఏర్పాటు చేసిన శ్మశానవాటికను ఎంపీపీ లత సోమవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ, టీడీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీలకు శ్మశాన వాటికలు లేక కాలువ గట్లు, రోడ్ల ప్రదేశాల్లో దహన క్రియలు చేసేవారని, బండ్రేవు కాలనీ గ్రామస్తులు గతంలో శ్మశానవాటిక కోసం మృతదేహాన్ని జాతీయ రోడ్డుపై ఉంచి ధర్నాలు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయన్నారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి ఎస్సీ, ఎస్టీ కాలనీలకు అన్ని మౌలిక వసతులతో శ్మశాన వాటికల ఏర్పాటుకు కృషి చేస్తోందన్నారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి చొరవతో మండలంలోని అన్ని ఎస్సీ, ఎస్టీ కాలనీలకు శ్మశాన వాటికల కోసం స్థలాలు పరిశీలించినట్లు చెప్పారు. అలాగే సుద్దగుంట గ్రామానికి ఏర్పాటు చేసిన శ్మశానవాటికను కూడా ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ధనంజయవర్మ, కో–ఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ ధన్‌రాజ్, వీఆర్వో తేజ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న గజ సంహారమూర్తి



9 అడుగుల గజసంహార మూర్తి



30 అడుగుల ధ్యానశివుడు

నగరి: మునిసిపల్ పరిధి కీళపట్టు త్రిపుర సుందరీ సమేత చంద్రమౌళీశ్వర ఆలయ ఆవరణలో శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని వినూత్న రీతిలో ఈశ్వరుని ప్రతిమలు ఏర్పాటు చేయడం పరిపాటి. అందులో భాగంగా ఈ ఏడాది నిర్మించిన 9 అడుగుల గజసంహార మూర్తి విగ్రహం చుట్టూ ధ్యానశివుని ఆకారంలో నిర్మించిన 30 అడుగుల ఎత్తు ఉన్న ఆలయం పలువురిని ఆకర్షిస్తోంది. ఈ విగ్రహాలను భక్తుడు గణేశ్ బృందం 27 రోజుల పాటు శ్రమించి తయారుచేసింది. 600 శంఖులు, 1500 నల్లేరు ముక్కలు, 15 ఉమ్మెత్త కాయలు, 70 బిళ్వకాయలు, వినియోగించి ఈ విగ్రహాలను తయారు చేశారు. శివరాత్రి ఉత్సవాల్లో ఈ ఏడాది ధ్యానశివుడు, గజసంహార మూర్తి విగ్రహాలు ప్రత్యేకంగా నిలుస్తాయని ఆలయ నిర్వాహకులు జలగండా సుబ్రమణ్యా స్వామి తెలిపారు.

అభివృద్ధి పనుల కోసం వినతి



డీఆర్‌ఎంకు వినతిపత్రం అందిస్తున్న రిటైర్డ్ సదరన్ రైల్వే కమర్షియల్ సూపర్‌వైజర్

నగరి: నియోజకవర్గంలోని ఏకాంబరకుప్పం, పుత్తూరు రైల్వేస్టేషన్ పరిధిలో చేపట్టవలసిన అభివృద్ధి పనులపై మంత్రి ఆర్కేరోజా ఆదేశాల మేరకు రిటైర్డ్ సదరన్ రైల్వే కమర్షియల్ సూపర్‌వైజర్ కుమారస్వామి డీఆర్‌ఎం గణేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన సోమవారం చెన్నైలో డీఆర్‌ఎంను కలిసిన మంత్రి ఆర్కేరోజా రైల్వే అభివృద్ధికి చేస్తున్న కృషిని డీఆర్‌ఎంకు వివరించారు. ఇప్పటికే ఏకాంబరకుప్పం, నగరి రైల్వేస్టేషన్‌లలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించినట్లు గుర్తుచేశారు. ప్రస్తుతం చేపట్టవలసిన పనులపై మంత్రి సూచనల మేరకు సిద్ధం చేసిన వినతిపత్రాన్ని అందించారు. అరక్కోణం రేణిగుంట సెక్షన్ పరిధిలోకి వచ్చే ఏకాంబరకుప్పం, పుత్తూరు స్టేషన్లలో ఫ్లైఓవర్ బ్రిడ్జి, అండర్ బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలని, చెన్నై ముంబై ఎక్స్‌ప్రెస్ ట్రైన్ నెంబరు 22160/22159ను ఏకాంబరకుప్పం స్టేషన్‌లో ఆపాలని, ఎలక్ట్రికల్ మల్టిపుల్ యూనిట్‌ను పుత్తూరు వరకు పొడిగించాలని, ఏకాంబరకుప్పం, నగరి స్టేషన్లలో సెకండ్ షిఫ్ట్‌లో రిజర్వేషన్ టికెట్లు రద్దుచేయడానికి అనుమతించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

దశాబ్దాల కల సాకారం

- టీడీపీ నాయకులు మోకాలొడ్డిన వైనం
- సీఎం దృష్టికి సమస్యను నివేదించిన డిప్యూటీ సీఎం
- ఇళ్ల పట్టాల మంజూరుపై దాసరపల్లె హర్షం



పట్టాలు మంజూరు చేయడంతో కృతజ్ఞతలు చెబుతున్న దాసరపల్లె గ్రామస్తులు

పెనుమూరు(కార్వేటినగరం): దశాబ్దాల కాలంగా దాసరపల్లె గ్రామస్తులు ఎదురు చూస్తున్న కలకు ప్రభుత్వం సాకారం చేసిందని ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం దాసరపల్లె గ్రామస్తులతో కలసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వే నంబర్ 7/7లో 18 ఎకరాలు పశువుల మేత భూమి ఉందని, ఇందులో 110 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. అలాగే గ్రామానికి చెందిన 40 మంది ఇల్లు లేని నిరుపేదలకు జగనన్న ఇళ్ల పట్టాలు మంజూరు చేశారని, ఇది ఓర్వలేని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి కలసి పశువుల మేత భూమిలో ఇళ్లు నిర్మించరాదంటూ హైకోర్టులో పిటీషన్ దాఖలు చేసి ఇళ్ల పట్టాలను రద్దు చేయించారన్నారు. అయితే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామానికి వచ్చిన డిప్యూటీ సీఎం నారాయణస్వామి దృష్టికి సమస్యను నివేదించినట్లు చెప్పారు. పశువుల మేత భూమిని శాశ్వత పట్టా భూమిగా మార్చి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేయడంతో ఆయన స్పందించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారన్నారు. శాశ్వత పట్టాలుగా మార్చి పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని రెవిన్యూ ప్రిన్సిపల్ కార్యదర్శిని సీఎం ఆదేశించడంతో దశాబ్దాల సొంతింటి కల నెరవేరిందని గ్రామస్తుల తరఫున సీఎం, ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దూదిమోహన్, విజయకుమార్‌రెడ్డి, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.